క్లుప్తంగా

రాజీమార్గం అత్యుత్తమం

తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిందూర



తిరువూరు: న్యాయస్థానాల్లో నెలకొన్న కేసుల పరిష్కారానికి రాజీమార్గం అత్యుత్తమమైనదని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అట్లూరి సిందూర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కక్షిదారులకు గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ పలు కారణాలతో కోర్టులకెక్కిన కక్షిదారులు మధ్యవర్తిత్వంతో రాజీ చేసుకోవాలని, 2005లో సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ రాజీ మార్గానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసుల్లో రాజీ పడి సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, న్యాయవాది మేకల నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



తిరువూరు: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం మాస కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు టి. గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. తొమ్మిది మంది దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎస్. సంధ్య, ఆలయ కమిటీ చైర్మన్ శశికళ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని బొగ్గు విభాగంలో అగ్ని ప్రమాదాలపై గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే సైరన్ మోగించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. అందుబాటులో ఉన్న రక్షణ దళ సిబ్బంది రంగంలోకి దిగి గాయపడిన వారిని ప్రమాద స్థలం నుంచి బయటకు తీసుకువచ్చారు. సమీపంలోని వైద్య శిబిరానికి తరలించి చికిత్స అందించారు. మిగిలిన కార్మికులను ప్రమాద స్థలం నుంచి సురక్షితంగా బయటకు తరలించారు. ఈ సందర్భంగా ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు మాట్లాడుతూ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు, వాటి నివారణ మార్గాలను తెలిపారు. ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

జి. కొండూరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక

జి.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో 2024–25 సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీ అరవపల్లి రాము ముఖ్య అతిథిగా హాజరై ఆడిట్ నిర్వహించారు. మండల పరిధిలో ఏడాది కాలంలో కూలీల వేతనాలు, మెటీరియల్ కోసం రూ.18.89 కోట్లు ఖర్చు చేశామని ఏపీఓ భాస్కర్‌రావు తెలిపారు. ఆడిట్ గురువారం రాత్రి వరకు పూర్తికాకపోవడంతో మస్టర్లలో తేడాలు, రికవరీ నగదు వివరాలను శుక్రవారం వెల్లడిస్తామని భాస్కర్‌రావు చెప్పారు.

అమ్మవారికి శాకంబరి అలంకారం



విస్సన్నపేట: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. విశేషాలంకారం అనంతరం ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమార్చనల్లో మహిళా భక్తులు పాల్గొన్నారు.

వేంకటాచలస్వామికి గరుడ వాహన సేవ



తిరువూరు: స్థానిక పాత తిరువూరులోని వేంకటాచలస్వామికి గురువారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గరుడ వాహన సేవ నిర్వహించారు. స్వామి వారికి అష్టోత్తర శతనామాలతో ప్రత్యేక పూజల అనంతరం ఆలయం చుట్టూ గరుడ వాహనంపై ఊరేగించారు. కాలసాని గోపాల నాగేశ్వరరావు దంపతులు ఈ సేవను నిర్వహించారని ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు తెలిపారు.

మురుగుతో సహవాసం

- డ్రెయినేజీల్లో కదలని మురుగునీరు
- వర్షాకాలంలో రోడ్లపైకి, ఇళ్లల్లోకి చేరుతున్న వైనం
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న ఆర్‌సీఎం కొత్త కాలనీ వాసులు



కొండపల్లి ఆర్‌సీఎం కొత్త కాలనీ వద్ద మురుగు నీటి కాలువ



కొండపల్లి కొత్త ఆర్‌సీఎం కాలనీ నుంచి ముస్తఫా నగర్‌కు వెళ్లే రోడ్డు ఇలా..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ఆర్‌సీఎం కొత్త కాలనీలో నెలల తరబడి మురుగు నీరు ముందుకు పారడంలేదు. మురుగు తిష్ట వేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. తరచూ కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండపల్లిలోని ఇతర ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు, వాడుక నీరు మొత్తం ఆర్‌సీఎం కొత్త కాలనీ మీదుగా ప్రవహించి బుడమేరు కాలువలో కలవాల్సి ఉంది. పట్టణానికి శివారుగా ఉన్న కాలనీ వద్దకు మురుగునీరంతా వచ్చి చేరుతోంది. మురుగునీరు పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు ముందుకు సాగడం లేదు. దోమలు వృద్ధి చెంది ప్రజలకు నిద్రలేని రాత్రులను మిగిల్చుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలం రోడ్లపైనే మురుగు పారుదల

ఆర్‌సీఎం కొత్త కాలనీ పట్టణానికి శివారుగా ఉన్నందున మురుగంతా ఆప్రాంతానికి వచ్చి చేరుతోంది. మామూలు రోజుల్లో వాడుక నీరు డ్రెయినేజీల్లో ప్రవహిస్తుంది. వర్షాల సమయంలో డ్రెయినేజీలు పొంగిపార్లి రోడ్లుపైనే నీరు ప్రవహిస్తోంది. ఒక్కో సమయంలో ఇళ్లల్లోకి వర్షం నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రజల రాకపోకలతో పాటు అసౌకర్యానికి గురవుతున్నారు. కాలనీకి ఆనుకుని ముస్తఫానగర్ చివరి వరకు ఉన్న పెద్ద కచ్చా డ్రెయినేజీలో ఏడాది పాటు మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కుపుటాలు అదిరే దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు జేసీబీతో డ్రెయినేజీలో పూడిక తీయిస్తున్న అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మురుగునీటి సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టాలని కోరుతున్నారు.

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఇటీవలి కాలంలో మున్సిపల్ అధికారులు కాలనీని సందర్శించి మురుగునీటి సమస్యను తెలుసుకున్నారు. మురికి నీరు వెళ్లే విధంగా జేసీబీతో సిల్ట్ తీయించి తాత్కాలిక చర్యలు చేపట్టారు. ముస్తఫా నగర్‌కు వెళ్లే రోడ్డు కూడా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీటి పారుదలకు స్థానికంగా సరైన వ్యవస్థ లేకపోవడంతో లోతట్టు ప్రాంతంలో మురుగు నీరు చేరుతోంది. వర్షాలు కురిసినప్పుడు మురుగు నీటితో కలిసిన వర్షం నీటితో ఆప్రాంతం చెరువును తలపిస్తోంది. ఈ పరిణామాల మధ్య ఇక్కడి మురుగుతో సహవాసం చేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆర్‌సీఎం కొత్త కాలనీ వద్ద రోడ్డు, పక్కా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి దుర్వాసన వెదజల్లకుండా పైన మూతలు కూడా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భరించలేని దుర్వాసన



ఆర్‌సీఎం కొత్త కాలనీలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో పట్టణంలోని మురుగు నీరంతా ఇక్కడకు చేరుతోంది. కచ్చా డ్రెయినేజీ నుంచి బుడమేరుకు చేరుతోంది. మురుగునీరు పారదల లేక నిల్వ ఉండటంతో భరించరాని దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి మురుగు నీటి పారుదలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– గద్దపాటి ప్రసాద్, న్యూ ఆర్‌సీఎం కాలనీ, కొండపల్లి

దోమల దండయాత్ర



కొండపల్లి న్యూ ఆర్‌సీఎం కాలనీలో ఏడాది పొడవునా మురుగునీరు నిలిచి ఉంటోంది. దోమలు వృద్ధి చెంది రాత్రిళ్లు నిద్రలేకుండా చేస్తున్నాయి. దోమల వలన సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయనే భయంగా ఉంది. మురుగునీరు లేకుండా చేస్తే దోమలు తగ్గుతాయి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– యాదాల ఎమేలమ్మ, ఆర్‌సీఎం న్యూ కాలనీ, కొండపల్లి

దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం

నూజివీడు: జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమం, సాధికారత లక్ష్యంగా చేపడుతున్న పలు కార్యక్రమాలపై ప్రజలకు, దివ్యాంగుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకు గాను పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, వారికి సమాజంలో తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించడంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో జీవించడానికి, సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని పొందడానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా అందిస్తున్న కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ తదితర వాటిని గురించి కో–ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి వివరించారు. వివరాల కోసం ఫోన్: 08812–249297, 7386565469 నంబర్లలో దివ్యాంగులు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంబీవై ప్రీమియం చెల్లించాలి

తిరువూరురూరల్: ప్రధానమంత్రి పంటల బీమా యోజన కింద ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటలకు బీమా ప్రీమియం రైతులు చెల్లించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. ఎకరాకు రూ.850 చొప్పున వరి పంటకు బీమా ప్రీమియం నిర్ణయించారని, బ్యాంకులు, వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో రుణాలు తీసుకునే రైతుల వద్ద బీమా ప్రీమియం కూడా వసూలు చేసి బీమా కంపెనీకి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. రుణాలు పొందని రైతులు తమ సమీప సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

పేరెంట్స్ హాజరు అంతంతమాత్రమే



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ సమావేశాల్లో తల్లిదండ్రుల హాజరు అంతంతమాత్రంగా ఉంది. గత వారం రోజులుగా ఉపాధ్యాయులు ఈ సమావేశంపై నేరుగా సమాచారం ఇచ్చినప్పటికీ తల్లిదండ్రులు సగం మంది కూడా హాజరు కాలేదు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల హాజరు నామమాత్రంగా ఉండటంతో సమావేశాలు పేలవంగా జరిగాయి. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఆర్డీఓ మాధురి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో, ఎస్‌ఐ సత్యనారాయణ గురుకుల పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణల అమలు

నూజివీడు: ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలను అమలు చేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన ఎస్. కల్యాణ హర్షను మెమెంటో, రూ. 10 వేల నగదు బహుమతితో సత్కరించారు. సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- **జి.కొండూరు:** అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నందున ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- **పైడూరుపాడు(విజయవాడరూరల్):** పైడూరుపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచి వేముల సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బయ్యారపు రవి కిశోర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వారకా తిరుమల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తనయుడు ఎస్వీఎస్ నివృతరావు, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి ప్రభాకరరావు మాట్లాడారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మైలవరం ఎస్‌ఎస్‌కే స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **ఇబ్రహీంపట్నం:** జాకీర్‌హుస్సేన్ కళాశాలలో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు పాల్గొన్నారు. కాచవరం ఎంపీపీ పాఠశాలలో సర్పంచి రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. మూలపాడు జెడ్పీ పాఠశాల, కేతనకొండ ఎంపీపీ పాఠశాలలో సమావేశాలు జరిగాయి.
- **ఆగిరిపల్లి:** విద్యార్థులు పోటీ తత్వంతో కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ బి.భార్గవి అన్నారు. మండలంలో అన్ని పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.
- **నూజివీడు:** పోతురెడ్డిపల్లి హైస్కూల్‌లో ని జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు మాట్లాడారు. సర్పంచి తగరం సుజాత, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** విస్సన్నపేట, నరసాపురం, పుట్రేల జెడ్పీ ఉన్నత పాఠశాలలు, విస్సన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- **ముసునూరు:** మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



పెనుగొలనులో గురువులను సన్మానించిన నిర్వాహకులు



కొండపల్లి సాయిబాబా ఆలయంలో పూజలు



విస్సన్నపేట పూజల్లో పాల్గొన్న భక్తులు

తిరువూరు: గురుపౌర్ణమి సందర్భంగా తిరువూరు నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో గురువారం విశేష పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. తిరువూరు షిర్డీ సాయి మందిరంలో సాయిబాబాను విశేషాలంకరణ చేసి తెల్లవారు ఝాము నుంచే భక్తులు సందర్శించుకున్నారు. మందిర కమిటీ ఆధ్వర్యంలో రిటైర్డు ఉపాధ్యాయుడు మచ్చా వెంకటేశ్వర్లును సత్కరించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తిరువూరు వేంకటాచల స్వామి దేవస్థానంలోని రామకోటి స్థూపం వద్ద రామాయణ పారాయణాన్ని గంపలగూడెం వికాస తరంగిణి సభ్యులు ఆచరించారు. తిరువూరులోని శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని సాయి మందిరంలో విద్యార్థులు, అధ్యాపకులు పూజాదికాలు జరిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

గంపలగూడెం మండలం పెనుగొలనులోని షిర్డీ సాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో కళాకారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు, కళాకారులు పాల్గొన్నారు. ఎ.కొండూరు మండలం గోపాలపురం సాయిబాబా దేవాలయంలో విశేషపూజలు, అన్నదానం నిర్వహించారు.

షిర్డీ సాయికి ప్రత్యేక అభిషేకాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గురుపౌర్ణమిని పురస్కరించుకుని కొండపల్లి శ్రీ షిర్డీ సాయి మందిరంలో సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. బాబాను దర్శించుకునేందుకు తెల్లవారు జామును నుంచే భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ముసునూరు: చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం, వేల్పుచర్ల గ్రామాల్లోని షిర్డీ సాయిబాబా మందిరాల వద్ద మందిర కమిటీల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. చెక్కపల్లి షిర్డీ సాయి బాబా మందిరంలో ఉదయం బాబా వారికి అభిషేకాలు, సత్యసాయి వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బాబాకు గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి:** గురుపౌర్ణమి సందర్భంగా గురువారం విజయవాడ రోడ్డులోని సింగన్నగూడెం బస్ స్టాప్ వద్ద గల సర్వ కార్యసిద్ధి షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఉదయం సాయిబాబాకు క్షీరాభిషేకం, ప్రత్యేక అలంకరణ, పల్లకీ సేవను ఆలయ అర్చకులు దేవులపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయిబాబా సర్వనామ సంకీర్తనను సాయి బాబా భక్తబంధం సభ్యులు నిర్వహించారు. ఏఎస్‌ఐ తవేరియా నాయక్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** విస్సన్నపేట షిర్డీ సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబాకు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిపారు. మందిరం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో గురుపౌర్ణమి కార్యక్రమాలు జరిగాయి.

పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

ముసునూరు: గత పాతికేళ్లుగా ముసునూరు తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నివాసముంటున్న నిరుపేదల స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ



రోడ్డు శుభ్రం చేస్తున్న సిబ్బంది

నూజివీడు: 15వ వార్డు పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో గురువారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పారిశుద్ధ్య సిబ్బందిని, డ్రెయిన్ మెన్లను, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలను ఏర్పాటు చేసి కాలనీలోని డ్రెయినేజీల్లో మురుగునీరు ప్రవహించేలా పూడికను, చెత్తచెదారాన్ని తొలగించారు. రోడ్లన్నీ శుభ్రం చేశారు. మురుగునీటి కాలువల వెంబడి బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. వర్షాకాలం కావడంతో దోమల బెడద పెరిగితే ప్రజలు జ్వరాల బారిన పడే ప్రమాదం ఉన్నందున శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టామని మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి తెలిపారు. ప్రతి రోజూ ఒక్కో ప్రాంతంలో, వార్డుల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. పట్టణ ప్రజలు శానిటేషన్ సమస్య ఎక్కడైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

మేలైన పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి



పాడి రైతులకు పశుగ్రాసం విత్తనాలను అందజేస్తున్న అధికారులు

ఆగిరిపల్లి: పాడి పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం పెరగాలంటే, నాణ్యమైన పశుగ్రాసాన్ని పచ్చి మేతగా అందించాలని నూజివీడు పశు సంవర్థక శాఖాధికారి కె.నరసింహారావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం మండలంలోని ఈదర పశు వైద్యశాలలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక పద్ధతిలో పశుగ్రాసం పంటల సాగు సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పశువులకు ఎండు గడ్డి వేస్తే వాటికి కావాల్సిన పోషకాలు అందవని చెప్పారు. పశుగ్రాసం విత్తనాలు 75 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఈదర పశు వైద్య శాఖాధికారి జి.శశివర్మ, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌తో పరిశ్రమలకు ప్రయోజనం

ఆగిరిపల్లి: పరిశ్రమల్లో సౌర విద్యుత్ వాడకం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని విద్యుత్ శాఖ ఎస్ఈ తోట శ్రీనివాసరావు అన్నారు. నెక్కలం గొల్లగూడెంలోని చుక్కపల్లి కుశలవ ఇంటర్నేషనల్ కంపెనీలో రెండు మెగా వాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పరిశ్రమల్లో సౌర విద్యుత్ వాడటం వలన పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.సత్యనారాయణ, డెప్యూటీ ఇంజనీర్ పోతురాజు, అడవినెక్కలం ఏఈ రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు

మైలవరం: వాతావరణ మార్పులను గ్రహించి మనం జాగ్రత్త పడకపోతే భావి తరాలలో భూమి ఎడారిగా మారే అవకాశం ఉందని, వాతావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన భాధ్యత అందరిపై ఉందని జాతీయ సదస్సు కన్వీనర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. రాముడు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగంలో ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. మద్రాస్ యూనివర్సిటీ నుంచి వచ్చిన వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ నారాయణ మతివాసన్, కడప యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ అరవీటి మధుసూదన్‌రెడ్డి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బ్రహ్మాజీరావు మాట్లాడారు. శాస్త్రవేత్త శంకర్‌రావు, ప్రదీప్ మదమంచి, వివిధ యూనివర్సిటీల నుంచి అధ్యాపకులు, ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఖాతాలు అనుసంధానం చేసుకోవాలి

తిరువూరు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థులలో తల్లికి వందనం పథకం వర్తించని వారు వెంటనే తమ బ్యాంకు ఖాతాలను, పోస్టల్ ఖాతాలను ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి జి. మహేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు బ్యాంకు ఖాతా లేకపోతే వెంటనే ప్రారంభించాలని, లేకుంటే తల్లికి వందనం పథకం డబ్బులు జమ అయ్యే అవకాశం ఉండదని చెప్పారు.

దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం



చాట్రాయి: లక్షల రూపాయలతో వెచ్చించిన రోడ్లు దమ్ము చక్రాల ట్రాక్టర్లతో ధ్వంసం అవుతున్నాయి. మండలంలో ఇటీవల ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. వర్షాలు కురవడంతో వరి నాట్లు వేసేందుకు రైతులు దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై నడుపుతుండటంతో ధ్వంసం అవుతున్నాయి. చాట్రాయి, జనార్దనవరం రోడ్డులో గొల్లగూడెం గ్రామం వద్ద, చనుబండ నరసింహారావుపాలెం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్లు ధ్వంసం అయ్యాయి. ఇప్పటికైనా దమ్ము చక్రాలకు పట్టాలు బిగించుకొని ట్రాక్టర్లు నడుపుకునే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.